ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం 29 డిసెంబరు 2024





చల్పాక ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టుల మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్పీ శబరీశ్ (ఫైల్)

2024 కాలచక్రం

సంచలనాల ఏడాది

- కుదిపేసిన చల్పాక ఎన్‌కౌంటర్, ఎస్సై హరీశ్ ఆత్మహత్య
- అలజడి రేపిన వాజేడులో అన్నదమ్ముల హత్య
- మావోయిస్టులపై పైచేయి సాధించిన పోలీసులు
- రక్తమోడిన రోడ్లు.. భయపెట్టిన పెద్దపులి

7లో..



భూపాలపల్లి పరిధిలోని ఫక్కీర్‌గడ్డలో భర్త చేతిలో హత్యకు గురైన మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)



అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టును చూపుతున్న ఎస్పీ కిరణ్‌ఖరే (ఫైల్)

దందాలకు అడ్డు ఏదీ?

- ఏడాదిలో మరింత పెరిగిన అసాంఘిక కార్యకలాపాలు
- విచ్చలవిడిగా గంజాయి, పీడీఎస్ బియ్యం, ఇసుక దందా
- మాయని మచ్చగా ఖాకీల వ్యవహారం
- పోలీసులకు సవాల్‌గా మారిన దొంగతనాలు
- శాంతిభద్రతలపై ఎస్పీ పకడ్బందీ చర్యలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దందాలకు అడ్డులేకుండా పోయింది. అసాంఘిక కార్యకలాపాలకు భూపాలపల్లి జిల్లా అడ్డాగా మారింది. జిల్లా వ్యాప్తంగా హత్యలు, గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, ఇసుక, గుట్కా దందా జోరుగా సాగాయి. రోడ్డు ప్రమాదాలు ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎక్కువగానే జరిగాయి. గతంతో పోల్చుకుంటే దొంగతనాలు భారీగా పెరిగాయి. దొంగలు చేతివాటాన్ని ప్రదర్శించి అందినకాడికి దోచు కుంటే.. పోయిన సొమ్మును రికవరీ చేయడం పోలీసులకు సాధ్యం కాలేదు. మరోవైపు హత్యలు పెరిగి పోయా యి. కుటుంబ కలహాలు, అనుమానాలు, మానసిక వేధింపులు, అనారోగ్య సమస్యలు ఇతరత్రా కారణాలతో ఆత్మహత్యలు చేసుకొని ఎంతో మంది తనువు చాలించారు. శాంతిభద్రతలకు విఘాదం కలగలేదు. ఎస్పీ కిరణ్ ఖరే నేతృత్వంలో పోలీస్ సిబ్బంది పకడ్బందీగా చర్యలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదాలతో తీవ్ర విషాదాలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పరిపాటిగానే మారాయి. 2023లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 87 మంది మృతి చెందారు. ఈ ఏడాది 2024లో 178 ప్రమాదాలు జరగ్గా 79 మంది మృతి చెందారు. 239 మంది క్షతగాత్రులుగా మిగిలిపోయారు. ఈ ప్రమాదాలకు ప్రధానంగా వాహనాలు అతివేగంగా వెళ్లడం మూలంగానే చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లా పరిధి నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఇసుక

మిగతా 8వ పేజీలో...

అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలి

అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలని అధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఐసీడీఎస్, పంచాయతీరాజ్, టీజీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో ఆయన కలెక్టరేట్‌లో శనివారం సమావేశమయ్యారు. పనుల పురోగతిపై సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులు చేపట్టాలని, రంగులు వేసి, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్డి సౌకర్యాల కల్పన పనులను త్వరిత గతికన పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. 10 కేంద్రాలు అప్‌గ్రేడ్, 50కేంద్రాల్లో తాగునీరు, 64 కేంద్రాల్లో మరుగుదొడ్లు, 64 కేంద్రాల్లో రంగులు వేసే పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ చిన్నయ్య టీజీఈడబ్ల్యూ ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎగుమతులకు ప్రణాళికలు రూపొందించాలి

టస్సార్, పత్తి, మిర్చి ఎగుమతి చేసేందుకు జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమ లశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడారు. జిల్లా నుంచి టస్సార్, పత్తి, మిర్చికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతి చేసేందుకు జిల్లా స్థాయి వెబ్‌సైట్ రూపొందించాలని తెలిపారు. రైతుల పారిశ్రామికాభివృద్ధికి, ఉపాధి, గ్రామీణ వ్యవసాయ ఉత్పత్తులను గుర్తించడానికి, వ్యాపారాలు నిర్వహణకు కార్యాచరణను ప్రారంభించాలన్నారు. ఉత్పత్తి నాణ్యతను, నైపుణ్యావృద్ధిని మెరుగుపరచడానికి ఉత్పత్తిదారులను ప్రోత్సహించడానికి ఈకార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలను రైతులకు అనుసంధానం చేస్తూ రైతులు సద్వినియోగం చేసుకనే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఫారెన్ ట్రేడ్ ప్రతినిధి శైలజ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో శనిత్రయోదశి పూజలు



కాళేశ్వరంలో కాలసర్ప దోష నివారణ పూజలు చేస్తున్న భక్తులు

మహదేవపూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో శనిత్రయోదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి నవగ్రహ పూజలు నిర్వహించారు. పూజారులు కాలసర్ప దోష నివారణ పూజలు చేశారు. ఉదయం నుంచే గోదావరిలో భక్తుల సందడి నెలకొంది. దూర ప్రాంతాల నుంచే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర , ఛత్తీస్‌గఢ్ నుంచి వేలాది మంది భక్తులు గోదావరికి చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

సింగరేణి స్టోర్స్‌లో ప్రమాదం

కాకతీయఖని, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియా స్టోర్స్‌లో శనివారం ప్రమాదం జరిగింది. రెండు క్రేన్ల (ఎస్‌కార్ట్) సహాయంతో ఫల్‌లెన్త్ రాడ్స్‌ను పక్కకు జరుపుతున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఓ క్రేన్ అదుపుతప్పి పక్కకు పడి ప్రాణాపాయం తప్పిందని తెలుస్తోంది. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదని, క్రేన్ క్యాబిన్ మాత్రం ధ్వంసమైందని కార్మికులు చెబుతున్నారు. ఈ విషయమై ఏరియా స్టోర్స్ అధికారి రాజబాబు వివరణ కోరగా ప్రమాదం జరిగిన మాట వాస్తవమేనన్నారు.

వడ్లకు కాంటాలు వేస్తలేరు..

ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతుల నిరసన



ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు

మల్హర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం పోసి రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రం నిర్వాహకులు కాంటాలు వేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని ఇప్పలపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద శనివారం సుమారు 50 మంది రైతులు నిరసన తెలిపారు. కాంటాలు వేయడంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు జాప్యం చేస్తున్నారన్నారు. పది లారీల వడ్లు కొనుగోలు కేంద్రంలోనే మగ్గుతోందని, వర్షం కురిసి తడిస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వారం రోజుల క్రితం మ్యాశ్చర్ వచ్చిన ధాన్యానికి టోకెన్లు ఇచ్చిన ఇప్పటి వరకు కాంటాలు కాలేదని రైతులు తెలుపుతున్నారు. ఈ విషయంపై వ్యవసాయ అధికారులకు ఫోన్ చేశామని, అయినా స్పందించడం లేదని తెలిపారు. దీంతో వడ్లన్నీ కొనుగోలు కేంద్రంలో మళ్లీ నేర్పాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంటాలు నిర్వహించకపోవడం వల్ల పరదాల కిరాయి రోజు రోజుకూ కిరాయి పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు చల్లా లచ్చయ్య, కొడపర్తి రమేష్, కొడపర్తి సురేందర్, బొమ్మని సూర్యనారాయణ పాల్గొన్నారు.

మేడారంలో ముందస్తు మొక్కులు



వనదేవతనలు దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు భక్తుల మొక్కులు శనివారం కొనసాగాయి. మినీ మేడారం జాతరకు ముందే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవార్ల సన్నిధికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు, కల్యాణ కట్టలో తలనీలాలు, తల్లులల గద్దెలకు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీరె సారెలు, కొబ్బరికాయలు, బెల్లం సమర్పించి యాట మొక్కులు చెల్లించుకున్నారు.

'ఇందిరమ్మ' సర్వేను పరిశీలించిన ప్రాజెక్ట్ డైరెక్టర్

రేగొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : మండలంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేను హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ లోకులాల్ శనివారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పలువురు దరఖాస్తుదారులను నేరుగా కలిశారు. సర్వేలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పుడు సమాచారాన్ని నమోదు చేయొద్దని, సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి తులజారాణి, కారోబార్ రమేష్ ఉన్నారు.


రాతి చిత్రాలను చూపిస్తున్న పరిశోధన బృందం

బంధాల గుట్టల్లో రాతి చిత్రాల గుర్తింపు

మేడారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం బంధాల గ్రామం దామర్ల గుట్టపై మధ్య శిలా యుగం నాటి రాతి చిత్రాలను గుర్తించామని సమ్మక్క- సారలమ్మ ఆర్కియాలజీ, ఇండిజినస్ పరిధనా కేంద్రం డైరెక్టర్ కొర్నిబెల్లి గణేష్ తెలిపారు. మేడారం ఆదివాసీ మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ కురుసం రవి బృందంతో కలిసి శనివారం పరిశీలించినట్టుగా తెలిపారు. పూర్వ కోయ, ఆదివాసీలు వేసిన లిపిగా నిర్ధానించామన్నారు. ఈ గుట్టలో మూడు ప్రాంతాల్లో రాక్ షెల్టర్లను గుర్తించినట్లు చెప్పారు. ఇందులో మొదటి షెల్టర్‌లో 12 చిత్రాలను గుర్తించామన్నారు. ఈ చిత్రాలు రాతి 20 మీటర్ల పొడవు, 15 మీటర్ల నిలువు, ఎత్తు ఉందన్నారు. ఈ చిత్రాల్లో కోయ సంప్రదాయలకు చెందిన ఐదో గొట్టు, నుదటి బొట్టు త్రిశూలం గుర్తు 18 దిక్కులా సింబల్ గొట్లను తెలియజేసే చేతి గుర్తులు ఉన్నాయన్నారు.

ముదురు ఎరుపు రంగులో చిత్రాలు

రెండో షెల్టర్‌లో ఐదు తలల నాగుపాము పడిగ చిత్రాలు ఉన్నాయన్నారు. మూడో షెల్టర్ 16 మీటర్ల పొడవు, 6 మీటర్ల ఎత్తు కలిగి ఉందన్నారు. ఇందులో మూడో గొట్టు చిత్రాలు, అడమరాజు కళ్లకు గంతలు కట్టుకొని కాకిని కొట్టిన బొమ్మలు, బానం బొమ్మ, ఆదివాసీలు పూర్వం నూనెను తయారు చేయడానికి ఉపయోగించిన గానుగ మొద్దు సింబల్, ఒక తల్లికి నలుగురు పిల్లలను తెలియజేసే చిత్రాలను గుర్తించామన్నారు.

ఈ చిత్రాలు ముదురు ఎరుపు రంగులో ఇసుక రాయి గుణం కలిగిన బండలపై వేసి ఉన్నాయ న్నారు. ఆయన వెంట పరిశోధన బృందం సభ్యులు, పురావస్తు శాస్త్రం, బాష శాస్త్రం విద్యార్థులు నవ్య, ధనలక్ష్మి, ధరని, స్వాతి, సమీరా, నవదీపిక, అర్జున్, ఆశోక్, రవి తదితరులు ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

వివరాలు వెల్లడించిన డీసీపీ రాజ మహేంద్రనాయక్



విలేకరులతో మాట్లాడుతున్న డీసీపీ నాయక్, చిత్రంలో ఏసీపీ, సీఐ

పాలకుర్తి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పాలకుర్తిలో పది రోజుల క్రితం జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. శనివారం పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ రాజమహేంద్రనాయక్ వివరాలు వెల్లడించారు. డీసీపీ కథనం ప్రకారం మండల కేంద్రంలో ఈనెల 18న రాత్రి చారగొండ్ల మల్లయ్య కాలనీలో నివాసం ఉండే బోడ లలిత ఇంట్లో చోరీ జరిగింది. బాధితురాలి ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి గుర్తు తెలియని వ్యక్తి బంగారం, వెండి నగలు, నగదును అపహరించారు.

లలిత ఫిర్యాదుతో వావిలాలకు చెందిన కరణం సాయికుమార్ ఈ చోరీకి పాల్పడినట్లు నిర్ధారించారు. శనివారం బస్టాండ్ సమీపంలోని పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 13 తులాల బంగారం, 40 తులాల వెండి రూ. 4.60 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. పలు చోరీ కేసుల్లో నిందితుడిపై గతంలో లింగాలఘన్‌పురం, రాయపర్తి, జవహర్ నగర్‌కేసర, మేడిపల్లి పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు కాగా 8 నెలలు జైలు జీవితం గడిపాడు. ఏసీపీ అంబటి నర్సయ్య, ఆధ్వర్యంలో విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడుని సకాలంలో గుర్తించి అపహరణకు గురైన నగలు, నగదు, స్వాధీనం చేసుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ మహేందర్‌రెడ్డి, పాలకుర్తి ఎస్సై పవన్‌కుమార్‌ను డీసీపీ రాజమహేంద్ర నాయక్ అభినందించారు.

మహిళా సంఘంలో రూ.5 లక్షలు స్వాహా

బ్యాంకులో జమ చేయకుండా వాడుకున్న వీవోఏ

కేసముద్రం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోరుకొండపల్లిలో మహిళా స్వయం సహాయక సంఘంలో రూ.5లక్షలు స్వాహా అయ్యాయి. ఐకేపీ సీసీ పిల్లి శ్రీనివాస్ తెలిపిన ప్రకారం..గ్రామానికి చెందిన స్నేహ సంఘం సభ్యులు బ్యాంకు నుంచి 2023, జనవరిలో రూ.10 లక్షలు రుణం తీసుకున్నారు. ఈ రుణానికి నెలకు రూ.35వేల ఈఎంఐ, రూ.1వెయ్యి పొదుపు వెరసి రూ.36వేలు బ్యాంకులో చెల్లించాల్సిఉంటుంది. కొద్దినెలలపాటు సంఘం లీడర్లు బ్యాంకుకు వెళ్లి ఈఎంఐలను చెల్లించారు. ఆ తర్వాత ఆ సంఘం సభ్యులు డబ్బులను బ్యాంకులో చెల్లించమని కోరుతూ గ్రామానికి చెందిన గ్రామైక్య సంఘం సహాయకురాలు (వీవోఏ) ఖైబాబకు ఇస్తూ వచ్చారు. కొద్దిరోజుల క్రితం సంఘం లీడర్లు తమ ఈఎంఐ చెల్లించేందుకు బ్యాంకుకు వెళ్లగా 14 నెలలుగా డబ్బులు చెల్లించడంలేదని బ్యాంకువారు తెలుపడంతో ఖంగుతిన్నారు. వెంటనే ఐకేపీ అధికారులకు ఫిర్యాదు చేయగా గ్రామంలో శనివారం విచారణ జరిపి పలు దఫాలుగా వీవోఏకు ఇచ్చిన రూ.5,00,400లను వాడుకున్నట్లు నిర్ధారించారు.

ఈ మేరకు తీర్మానించగా రెండు నెలల్లో చెల్లిస్తానని వీవోఏ ఒప్పుకున్నట్లు సీసీ తెలిపారు. వీవోఏపై చర్యలు తీసుకునేందుకు ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు సీసీ తెలిపారు. మహిళా సంఘాల సభ్యులెవరూ తమ వాయిదా డబ్బులను వీవోఏలకు ఇవ్వవద్దని, నేరుగా బ్యాంకులో చెల్లించాలని సూచించారు.

రఘునాథపల్లి ఎస్ఐకి జైలు


ఎస్ఐ నరేష్

రఘునాథపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రఘునాథపల్లి ఎస్ఐగా పని చేస్తున్న డి.నరేష్‌కు వారం రోజుల జైలు శిక్షతోపాటు రూ.50వేల జరిమానా విధిస్తూ శుక్రవారం హైకోర్టు తీర్పు వెలువరించింది. తరిగొప్పుల ఎస్ఐగా నరేష్ పని చేస్తున్నప్పుడు కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా ఓ వ్యక్తిని అరెస్టు చేశాడు. ధాన్యం అమ్మకాల విషయంలో తరిగొప్పుల పోలీస్ స్టేషన్‌లో గొలుసు నర్సయ్యపై 11ఫిబ్రవరి 2023న కేసు నమోదైంది. దీంతో నర్సయ్య హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారించిన హైకోర్టు, సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు జారీ చేసి చట్టప్రకారం దర్యాప్తు చేయాలని ఎస్ఐని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ నోటీసులు జారీ చేసిన ఆరు రోజుల తర్వాత 17 ఫిబ్రవరి 2913న నర్సయ్యను ఎస్ఐ నరేష్ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాడు.

దీంతో నర్సయ్య దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై జస్టిస్ కే. సురేందర్ విచారణ చేపట్టి ఎస్ఐ డి.నరేష్‌కు వారం రోజుల జైలు శిక్షతో పాటు బాధితుడికి పరిహారం కింద రూ.50వేలు చెల్లించాలని ఆదేశిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. హైకోర్టు జారీ చేసిన నోటీస్ ఎస్ఐ నరేష్‌కు అందలేదని, నోటీసును నర్సయ్య సైతం ఎస్ఐ దృష్టికి తీసుక రాకపోవడం వల్లనే అరెస్టు చేసినట్లు తెలుస్తుంది. రఘునాథపల్లి ఎస్ఐ డి.నరేష్‌కు హైకోర్టు జైలు శిక్షతోపాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిన విషయం దావానంలా వ్యాపించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

ఉపాధి కోసం వెళ్లి.. ఊపిరి పోయి..

- హైదరాబాద్‌లో కారు ఢీకొని వాచ్‌మన్ మృతి
- మృతుడు కేసముద్రం మండల వాసి


ప్రమాదంలో మృతి చెందిన గణేష్

కేసముద్రం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవనోపాధి కోసం పొట్టచేతపట్టుకొని హైదరాబాద్‌కు వెళ్లి నైట్‌వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గిరిజనుడు కారు ఢీకొని అక్కడికక్కడే ప్రాణాలు విడిచిన విషాద ఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. మృతుని బంధువులు తెలిపిన ప్రకారం.. కేసముద్రం మండలం తౌర్యతండా జీపీ పరిధిలో ముత్యాలమ్మతండాకు చెందిన గుగులోత్ గణేష్ (32) తండాలో ఎకరం వ్యవసాయ భూమి ఉన్నా పంటలు సరిగా పండకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాడు. తమ ఇద్దరు కుమారులను తొర్రూరులోని ప్రైవేటు హాస్టల్లో చేర్పించాడు. ఎనిమిది నెలల క్రితం తన భార్య పార్వతితో కలిసి హైదరాబాద్‌కు ఉపాధి కోసం వెళ్లాడు. పార్వతి ఇళ్లలో పనిమనిషిగా గణేష్ ఒక ప్రైవేటు కంపెనీలో నైట్‌వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కంపెనీకి వెళ్లిన గణేష్ ఉదయం తన విధులు ముగించుకొని సైకిల్‌పై తిరిగి తాను నివాసం ఉండే ప్రాంతానికి వెళుతుండగా మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అయ్యప్పసొసైటీ సమీపంలో ఓ కారు వేగంగా వెనుక నుంచి సైకిల్‌ను ఢీకొట్టింది. వెంటనే గణేష్ ఎగిరి పక్కనే ఉన్న రోడ్డు ప్లాట్‌ఫాంపై పడడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఉపాధి కోసం వెళ్లి ప్రాణాలు పోగొట్టుకోవడంతో తండాలో తీవ్ర విషాదం నెలకొంది.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మెపా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండి జాతి అభివృద్ధి, ఐక్యత కోసం, రిజర్వేషన్ సాధన కోసం పోరాడాలన్నారు. అనంతరం మెపా జిల్లా ఉపాధ్యక్షులుగా భూమ నరేష్, కల్లెబోయిన కిరణ్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, నాయకులు తాళ్ల రవీందర్, సింగారపు రామకృష్ణ, దండు చిరంజీవి, సాధు రఘు, మోరా రాజన్న, వెంకటనర్సయ్య, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

జనగామ రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏబీవీ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల గడువు పొడిగిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల పోస్టులను ఈనెల 31 వరకు పొడిగించడం జరిగిందన్నారు. కామర్స్-1, పొలిటికల్ సైన్స్-1లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తిగల అభ్యర్థులు 31 వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. జనవరి 2న ఏబీవీ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

డిప్యూటేషన్లను రద్దు చేయాలి : టీపీటీఎఫ్

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో పని చేయాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యాధికారులకు ప్రభుత్వం ఇచ్చిన డిప్యూటేషన్లను రద్దు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పాల ఉప్పస్వామి డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్రశిక్షా ఉద్యోగులు జిల్లాకేంద్రంలో చేపడుతున్న నిరవధిక సమ్మె శనివారం నాటికి 19వరోజుకు చేరుకోగా ఆయన శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా ఉప్పస్వామి మాట్లాడుతూ గత 19రోజులుగా సమస్యలను పరిష్కరించాలని సమగ్రశిక్షా ఉద్యోగులు సమ్మె చేస్తుంటే వారి సమ్మెను విరమించాల్సిందిపోయి వారి స్థానంలో ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపాలని చూడడం దారుణమని అన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో విద్యావ్యవస్థ కుంటుపడి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమగ్రశిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. శిబిరంలో టీపీటీఎఫ్ నాయకులు రాందేవ్, రఘురాం, శ్యాంసుందర్, పి.సమ్మయ్య, వైనాల స్వామి, బి.రమేష్, గోపి, సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, మహిళా అధ్యక్షురాలు జీవనప్రియ, కోశాధికారి పాడియా కుమార్, ఉపాధ్యక్షుడు ఎమ్డీ.ఫిరోజ్, సభ్యులు చిరంజీవి, రమేష్, దేవేందర్, ప్రవీణ్, ప్రతిభ, నాగలక్ష్మి, హరిత, అశ్విని, కవిత, భారతి, అనిత, రాధిక, జ్యోతి, గంగ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

హామీ నెరవేర్చిన మంత్రి సీతక్క

బోరు వేయడంతో తీరిన విద్యార్థినుల తాగునీటి కష్టాలు

కొత్తగూడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఇచ్చిన హామీని నెరవేర్చారు. మంత్రి గాంధీనగర్ గురుకులంలో విద్యార్థినుల తాగునీటి కష్టాలు విని మూడు రోజుల్లోనే బోరు వేయించి విద్యార్థినుల తాగునీటి కష్టాలు తీర్చారు.

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గాంధీనగర్‌లోని గిరిజన సంక్షేమ శాఖ బాలిక గురుకుల విద్యాలయంలో ఈ నెల 25న మంత్రి విద్యార్థినులతో బస చేశారు. గురుకులంలో తాగునీటి కష్టాల గూర్చి విద్యార్థినిలు, ఉపాధ్యాయులు మంత్రి సీతక్క దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే స్పందించిన సీతక్క బోరు వేయించాలని మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్‌ను ఆదేశించారు. శనివారం గురుకులంలో బోరు వే యించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పన, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుమ్మడి సమ్మయ్య, నాయకులు వజ్జ బాలరాజు, సిరిగిరి సురేష్, చందు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


గాంధీనగర్ గురుకులంలో బోరును ప్రారంభిస్తున్న రణధీర్

ఆశాలకు న్యాయం జరిగే వరకు పోరాటం



మహబూబాబాద్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్లకు నెలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు చెల్లించేంతవరకు తమ పోరాటం ఆగదని సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. జయలక్ష్మి అన్నారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి చేపట్టిన బస్ జాత శనివారం మానుకోట జిల్లాకు చేరుకుంది. స్థానిక బస్టాండ్ ఏరియా వద్ద ఘన స్వాగతం పలికి పెరుమాండ్ల జగన్నాథం భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ... ఎన్నికల మెనిఫెస్టోలో పెట్టిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా వర్కర్లకు కనీస వేతనంనెలకు రూ.18 వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, ఆకుల రాజు, కుమ్మరికుంట్ల నాగన్న, యూనియన్ బాధ్యులు కె.సునిత, సాధన, పద్మ , బాలమణి, రమణ, ఉపేంద్ర, సుజిత, రమాదేవి, ఆసియా, స్వరూప, రేణుక, జ్యోతి. చంద్రకళ, కాళేశ్వరీ, నళిని, రాధ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

హాజరైన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే


విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని పంగిడిపల్లిలో శనివారం ముదిరాజ్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం జరిగింది. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి దీవెనెలతో ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఉండాలని కోరుకున్నారు. మరో అతిథిగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో పంగిడిపల్లి ముదిరాజ్ కులస్థులు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, మండల నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై గళం విప్పాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఇరుగు పైడి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయాల సాధనలో భాగంగా ఎస్సీ వర్గీకరణ కోసం గళం విప్పి గజ్జె కడదామని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) జాతీయ నాయ కుడు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఇన్‌చార్జి ఇరుగు పైడి పిలుపునిచ్చారు. ములుగులో రొంటాల కుమార్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే ఏ కులానికి అన్యాయం జరుగదన్నారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీల్లో ఉన్న అన్ని కులాలకు రిజర్వేషన్లు లభించి న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ పోరాటం న్యాయమైనందునే సమాజం మొత్తం మద్దతు ఇచ్చిందని కానీ, మాలలలు తమకున్న రాజకీయ పలుకుబడితో ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి నేడు బలంగా ప్రయత్నిస్తున్నారన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా వర్గీకరణ కోసం పోరాడాలన్నారు. అనంతరం జిల్లా కళాకారుల నిర్మాణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రొంటాల కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇనుముల రమేష్, ఉపాధ్యక్షుడిగా మందపల్లి నవీన్, కార్యదర్శిగా తిరుపతి, గౌరవ అధ్యక్షుడిగా గుగ్గిళ్ల సాగర్‌లు ఎన్నికయ్యారు. ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంబాబు, నాయకులు గజ్జెల ప్రసాద్, విజయ్, శంకర్, రాజేందర్, మల్లయ్య, దూడపాక రాజేందర్, కన్నం రాజు, నెమలి నర్సయ్య, వావిలాల స్వామి, మరాఠి రవీందర్, తోకల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అడ్రినల్ గ్రంథికి లాప్రోస్కోపిక్ చికిత్స

యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి

మాట్లాడుతున్న యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి →



వరంగల్ మెడికల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అడ్రినల్ కణతిని లాప్రోస్కోపిక్ పద్ధతిలో తొలగించి రోగి ప్రాణాలను కాపాడినట్లు శ్రీనివాస కిడ్నీ సెంటర్ వైద్యులు యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన నాంపల్లి మానస (31) ఎడమవైపు కడుపునొప్పితో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొంది తగ్గకపోవడంతో తమ ఆస్పత్రికి వచ్చినట్లు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రోగికి ఎడమ అడ్రినల్ గ్రంథిలో కణతి 14 సెంటిమీటర్లు ఉండి స్ప్లీన్, ప్యాంక్రియాస్, ఎడమ కిడ్నీకి అతుక్కొని ఉందని గుర్తించామన్నారు.

అత్యంత క్లిష్టమైన లాప్రోస్కోపిక్ పద్ధతిలో సుమారు 3 గంటల పాటు శ్రమించి ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశామ న్నారు. మిగతా అవయవాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఎంతో నైపుణ్యంతో శస్త్ర చికిత్స చేసి నట్లు తెలిపారు. హైదరాబాద్ తర్వాత హనుమ కొండలోనే ఈ తరహా ఆపరేషన్ తొలిసారి చేశా మన్నారు. యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డితో పాటు డాక్టర్ అభినయ్, డాక్టర్ ప్రభురామ్, అనస్తీషియా వైద్యులు స్రామాట్ లాప్రోస్కోపిక్ సర్జరీలో పాల్గొన్నారు.

నేరం.. శిక్ష.. నింద



పోలీసు శాఖలో 2024ది ప్రత్యేక పేజీ

వరంగల్ క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాదిలో ఎఫ్ఐఆర్‌లు తక్కువగా నమోదైనప్పటికీ ఆస్తుల నేరాలు, మోసాలు, న్యూసెన్స్ ఘటనలు పెరిగాయి. కొంత మంది పోలీసులు వివాదాల్లో చిక్కుకొని పోలీసుశాఖ చెడ్డపేరు తీసుకొచ్చి ప్రజల్లో నమ్మకం పోయేలా వ్యవహరించారు. కొంతమంది పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజల ఫిర్యాదులపై సత్వరమే స్పందించి రాష్ట్ర పోలీసుబాస్‌తో ప్రశంసలు అందుకున్నారు. కమిషనరేట్‌లో కొత్తగా యాంటీ డ్రగ్ టీంతో పాటు వరంగల్, ఖమ్మం జిల్లాకు కలిపి జనవరిలో కొత్తగా ఏర్పాటైన నార్కోటిక్స్ బృందాలతో పోలీసుశాఖ గంజాయిని అధిక మొత్తంలో పట్టుకుంది.

సంచలనంగా మారిన ఎస్‌బీఐ దోపిడీ

వరంగల్ జిల్లా రాయపర్తి మండలకేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో నవంబరు 18న అర్ధరాత్రి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఏడుగురు ముఠా సభ్యులు చొరబడి సుమారు రూ.14 కోట్ల విలువ చేసే బంగారం ఎత్తుకెళ్లడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. బ్యాంకు లాకర్లలో బంగారం దాచిపెట్టు కున్న ఖాతాదారులంతా బ్యాంకు వద్ద చేరుకొని పోలీసులను ప్రాధేయపడ్డారు.

ఎట్టకేలకు చోరీ జరిగిన 18 రోజులకు ఏడుగురు ముఠా సభ్యుల్లో నుంచి ఉత్తరప్రదేశ్‌కు చెందిన అర్షాద్ అన్సారీ, షాఖీర్‌ఖాన్ అలియాస్ బోలెఖాన్, హిమాన్షు బిగాం చండ్ జాన్వర్‌ను అరెస్టు చేసి రూ.1,80,4000 విలువచేసే 2కిలోల 520 గ్రాములు బంగారం అభరణాలు, చోరీకి వినియోగించిన కారు, పదివేల నగదును స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నలుగురు నిందితుల్లో ప్రధాన నిందితుడు మహమ్మద్ నవాబ్ ఇటీవలే పోలీసులకు పట్టుకున్నప్పటికీ అతడి నుంచి ఎలాంటి బంగారాన్ని స్వాధీనం చేసుకోలేకపోయారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉండగా.. సుమారు రూ.12 కోట్ల విలువైన బంగారం జాడ ఇంతవరకు తెలియరాలేదు. చోరీ జరిగి రెండు నెలలకు పైగా అయినప్పటికీ బంగారం రికవరీ కాకపోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

డ్రగ్స్ నివారణకు కొత్తగా బృందాలు

కమిషనరేట్ పరిధిలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు కమిషనరేట్ కార్యాలయంలో యాంటీ డ్రగ్ టీమ్ కొత్తగా ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లో సీఐతో ఒక ఆర్ఐ, ముగ్గురు ఆర్ఎస్సైలు ఆరుగురు సిబ్బందిని ఏర్పాటు చేశారు.

ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు కొత్త నార్కోటిక్స్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. నార్కోటిక్స్ పీఎస్ ఈ ఏడాది జనవరి నుంచి పనిచేస్తుండగా డిసెంబర్ 3న సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండ పర్యటనకు వచ్చిన సందర్భంగా వర్చువల్ పద్ధతిలో పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు.

నార్కోటిక్స్ పోలీ సులతో పాటు కమిషనరేట్ యాంటీ డ్రగ్ టీమ్‌లు కలిసి పెద్ద మొత్తంలో గంజాయిని సీజ్ చేశారు. వెస్ట్‌జోన్‌లోని జనగామ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ విధులు కోసం ప్రత్యేకంగా 15 మంది సిబ్బందిని కేటాయించారు.

ప్రతిభకు ప్రశంసలు

ఫిర్యాదుదారులకు సకాలంలో సేవలందించినందుగానూ పౌర సేవల్లో భాగంగా ఆత్మకూరు, చిల్పూరు పోలీస్‌స్టేషన్‌లకు బెస్ట్ సిటిజన్ సర్వీస్ రాష్ట్ర స్థాయి అవార్డులు దక్కాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు కేంద్ర ప్రభుత్వం అందించే అతి ఉత్కృష్ట సేవా పతకాలకు హెడ్‌కానిస్టేబుల్ మల్లారెడ్డి, కానిస్టే బుల్ మహేశ్‌లు ఎంపికయ్యారు. సైబర్ నేరాలను నియంత్రించడం కోసం కేంద్ర హోంమంత్రి శాఖ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ కమాండోల శిక్షణకు తెలంగాణ రాష్ట్రం నుంచి వరంగల్ కమిషనరేట్‌లో డిప్యూటీ ఏవోగా విధులు నిర్వర్తిస్తున్న ప్రశాంత్ ఎంపికయ్యాడు. మహిళపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో నిందితులకు ఉరిశిక్షపడేలా దర్యాప్తు జరిపిన ఇంటెలిజెన్స్ డీఎస్పీ ఆడెపు సత్యనారా యణకు నవం బర్ 1న కేంద్ర ప్రభు త్వం యూ నియన్ మెడల్ ప్రక టించింది.

ఏసీబీ దాడులు

అవినీతికి పాల్పడుతూ అక్రమ అస్తులను కూడబెట్టిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులను ఏసీబీ ప్రత్యేక నిఘా పెట్టి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 కేసులు నమోదు చేసి 28 మందిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. 2011లో ఓ కేసులో పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్‌కు ఏడాది జైలు శిక్ష పడింది.

హత్యల కలకలం

కిందటేడు కంటే ఈ ఏడాది హత్యలు కొంత తక్కువ జరిగినప్పటికీ ఈ మధ్యకాలంలో మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరి ధిలోని భద్రకాళి చెరువు కట్ట వద్ద కారులో లభ్యమైన రిటైర్డు బ్యాంకు ఉద్యోగి రాజుమోహన్ మృతదేహంతో నగరంలో కలక లం రేపింది. జఫర్‌గఢ్ మండలం బుర్హాన్‌పల్లిలో రాజకీయ కక్షల కారణంగా కిరాయి రౌడీలతో తండ్రీ, కొడుకులు కలిసి ఇంట్లో ఉన్న వ్యక్తిని అతి దారుణంగా చంపడం కమిషనరేట్‌లో తీవ్ర సంచలనంగా మారింది. ఇటీవల మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో బిహార్ వ్యక్తిని అనుమాన నెపంతో కొందరు వ్యక్తులు హతమార్చడం గ్రేటర్ వరంగల్‌లో తీవ్ర చర్చకు దారి తీసింది. రాజు మోహన్, బిహార్ వ్యక్తి కొద్ది రోజుల తేడాతోనే హత్యకు గురికావడం ప్రజలను భయాందోళనకు గురయ్యారు.

వివాదాల్లో పోలీసులు

ఐజీ అటాచ్‌గా ఉన్న సీఐ ఎం.రవికుమార్ కాజీపేట పీఎస్ పరిధిలోని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. అదే అపార్ట్ మెంట్‌లో ఉన్న బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు గురి చేయడంతో కాజీపేట పోలీస్‌స్టేషన్ రవికుమార్‌పై పోక్సో కేసు నమోదైంది. అజ్ఞాతంలో ఉన్న సీఐని ముందస్తు బెయిల్ తెచ్చుకునేంతవరకు అరెస్టు చేయకుండా కాపాడారని కమిషనరేట్ పోలీసులపై తీవ్ర విమర్శలు వచ్చాయి. మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ యూనిఫామ్‌లో పాల్గొని రాజకీయ ప్రసంగాలు చేస్తూ ప్రజల్లోకి తప్పుడు సమాచారం చేరవేశారనే విమర్శలు వచ్చాయి. ఓ మంత్రి బంధువుతో ఎల్కతుర్తి ఎస్సై రాజ్‌కుమార్ అంటకాగుతూ విధుల్లో అలసత్వం కారణంగా సస్పెన్షన్‌కు గురయ్యాడు. మరికొంత మంది అధికారులు వివాహేతర సంబంధాలు కొనసాగిస్తూ వార్తల్లో నిలిచారు.

అలాగే ఆగస్టు 2న పర్వతగిరి ఎస్సై గుగులోతు వెంకన్న రూ. 20,000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. 'ఏక్ స్టేట్ ఏక్ పోలీసు' నినాదాన్ని అమలు చేయాలని మామునూరు ఫోర్త్ బెటాలియన్ పోలీసులు రోడ్డెక్కారు.

ముందస్తు చర్యలతో నేరాలు తగ్గుముఖం

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- 2024 వార్షిక నేర నివేదిక విడుదల

వరంగల్ క్రైం, (ఆంధ్రజ్యోతి) : ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా గతంకంటే ఈ ఏడాది నేరాలు తగ్గాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ 2024 సంవత్సరంనకు సంబంధించి క్రైం వార్షిక నివేదిక ప్రకటన సందర్భంగా శనివారం కమిషనరేట్ ఆవరణంలో సీపీ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కమిషనరేట్ యాంటీ డ్రగ్స్‌తో పాటు వరంగల్ నార్కో టిక్స్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు ద్వారా కమిషనరేట్ పరిధిలో అధిక మొత్తంలో గంజాయిని పట్టుకుందన్నారు. పోలీస్‌శాఖలో క్రైమ్, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ మూడు విభాగాలుగా విభజించి ఉంటాయన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు జనగామ జిల్లాలో 15 మంది సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించామన్నారు. రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్ నిబంధనలపై కొంత కాలంగా విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొత్తంగా గతం కంటే ఈసారి 11 శాతం క్రైమ్ రేటు తగ్గిందన్నారు. 45 మంది అంతరాష్ట్ర ముఠా సభ్యులను పట్టుకొని సుమారు రెండున్నర కోట్ల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు 590 కేసుల్లో 1,145 మంది నిందితులను అరెస్టు చేసి రూ.10,77,20,196 కోట్లను సీజ్ చేశామన్నారు. సిబ్బంది కొరతతో గతంలో కొంత ఇబ్బందులు ఉండేదని, ప్రస్తుతం ఈ ఏడాది 800 పోలీసులు కమిషనరేట్‌కు కొత్తగా వచ్చారన్నారు.

పాత, కొత్త వారిని కలుపుకొని రానున్న రోజుల్లో నేర రహిత సమాజంకు కృషి చేస్తామని సీపీ ప్రకటించారు. జనవరి 1 వేడుకల దృష్ట్యా ఇప్పటికే రోడ్లపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ మనాన్‌భట్, ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, అడిషనల్ డీసీపీ రవి, సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్‌రాజు, ఎస్‌బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ కర్ణాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

నో కామెంట్స్

వార్షిక నివేదిక వెల్లడించిన అనంతరం విలేకరులు సంధించిన ప్రతీ ప్రశ్నకు సీపీ 'నో కామెంట్' అంటూ దాటవేశారు. పోక్సో కేసులో నిందితుడు సీఐ రవికుమార్ ముందస్తు బెయిల్ తెచ్చుకునేంతవరకు ఎందుకు అరెస్టు చేయలేదు..? ఇది పోలీసుల వైఫల్యం కాదా? అని ప్రశ్నిం చగా సమాధానాన్ని దాటవేశారు. ఎల్కతుర్తి ఎస్సైపై సస్పెన్షన్ వేటు వేసి అదే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏసీపీ నందిరాంనాయక్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తే సమా ధానం చెప్పలేదు. రౌడీషీటర్ల ఆగడాలు మితి మీరుతున్నాయని పత్రికల్లో కథనాలు వస్తున్నాయి కదా.. వారిమీద ఎలాంటి చర్యలు తీసుకున్నారని అడగగా, కేసు నమోదైతేనే చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు కానివారిపై ఏ విధంగా చర్యలు తీసుకుం టామని పీసీ ప్రశ్నించారు. ఆపై విలేకరులు ప్రశ్నలు అడుగుతుండగానే సీపీ వేదికపై నుంచి వెళ్లిపోయాడు.

సంచలనాల ఏడాది

- అలజడి రేపిన వాజేడులో అన్నదమ్ముల హత్య
- రక్తమోడిన రోడ్లు.. భయపెట్టిన పెద్దపులి



చల్పాకలో మావోయిస్టుల మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్పీ శబరీశ్ (ఫైల్)

ములుగు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): 2024.. కాలగర్భంలో కలిసి పోతూ చేదు జ్ఞాపకాలను మిగిల్చింది. రాష్ట్రస్థాయిలో సంచలనం కలిగించిన పలు ఘటనలు ములుగు జిల్లాలో జరిగాయి. ఎన్‌కౌంటర్లు, హత్యలు, రోడ్డు ప్రమాదాలు అనేక కుటుంబాలను శోకసంద్రంలో ముంచాయి. డిసెంబరు 1న తెల్లవారుజామున ఏటూరునాగారం మండలం చల్పాక అటవీ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు.

మావోయిస్టులపై పోలీసుల పైచేయి

ఛత్తీస్‌గఢ్- ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు కలిగిన ములుగు జిల్లా అడవులు నిత్యం పోలీసులు, మావోయిస్టుల చర్య, ప్రతిచర్యలతో అట్టుడికిపోతూనే ఉంటుంది. ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణలోకి వలస వచ్చేక్రమంలో మావోయిస్టులకు జిల్లా పోలీసులు అడ్డుకట్ట వేశారు. ఏప్రిల్ 5న ఛత్తీస్‌గఢ్‌లోని ఊసూరు పీఎస్ పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు. ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ ఆధ్వర్యంలో తెలంగాణ పోలీసులు ఈ ఎన్‌కౌంటర్‌కు పాల్పడి నట్టు మావోయిస్టులు లేఖ విడుదల చేశారు. రెండు ఎన్‌కౌంటర్లలో 8 మంది మావోయిస్టులను కాల్చి చంపిన పోలీసులు పదిమందికి పైగా దళ సభ్యులు లొంగిపోయేలా చేశారు. తాడ్వాయి మండలం ఒడ్డుగూడెం అడవుల్లో మావోయిస్టులు దాచిన ఆయుధ డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కుదిపేసిన చల్పాక ఎన్‌కౌంటర్, ఎస్సై హరీశ్ ఆత్మహత్య

వీరిలో ముఖ్య నేతలు భద్రు, మధు ఉన్నారు. వారిపై పోలీసులు విషప్రయోగం చేశారని, బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ పౌరహక్కుల సంఘం ఆరోపించగా మధు భార్య మీనా హైకోర్టులో కేసు వేసింది. మరుసటి రోజే వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సూర్యాపేట జిల్లాకు చెందిన అనూష అనే యువతి ప్రేమపేరుతో వంచించడంతో బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. నవంబరు 21న వాజేడు మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ఊకే రమేష్, ఆయన సోదరుడు అర్జున్‌ను మావోయిస్టులు కత్తులు, గొడ్డళ్లతో అతి కిరాతంగా హత్య చేశారు. తాడ్వాయి మండలం అల్లిగూడెం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు దళసభ్యుడు నల్లమారి అశోక్ హతమయ్యాడు. గంగారం అడవుల్లో ఏటూరునాగారం మండలానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ సుజాత హత్యాచారానికి గురైంది. 24గంటల్లోనే ఈ కేసును పోలీసులు ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో డిసెంబరు 22న ఓర్సు శ్రీను అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధం పెట్టు కున్న ఆయన భార్య, ప్రియుడు మరో ఇద్దరితో కలిసి అతడిని హత్య చేసిన ట్లు పోలీసులు నిర్ధారించారు. వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుర్రం పేటలో సకినాల సరస్వతి అనే మహిళ హత్యకు గురైంది. ఆమెను కొడుకే గొంతునులిమి హత్య చేసినట్లు తేలింది. జనవరి 26న ములుగులోని ఎస్సీ కాలనీలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అంజిత్, విజయ్ అనే ఇరువురు దుర్మరణం చెందారు. జూలై 3న వాజేడు మండలం కొంగాల అటవీ ప్రాంతంలో మావోయి స్టులు అమర్చిన మందుపాతర పేలి జగన్నాథపురానికి చెందిన ఇల్లందుల ఏసు అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వెంకటాపురం మండలానికి చెందిన డర్రా సునీత అనే మహిళ కర్రెగుట్ట అటవీప్రాంతంలో ప్రెషర్ బాంబు పేలి తీవ్రంగా గాయపడింది.

మరికొన్ని సంఘటనలు

కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో ఆర్టీసీ బస్సు కింద పడి లక్ష్మి అనే వృద్ధురాలు మృతిచెందింది. ఇదే మండలం కంతనపల్లిలో లంజపెల్లి రవి అనే వ్యక్తి ట్రాక్టర్ రోటవేటర్‌లో పడి మరణించాడు. ఏటూరు గ్రామానికి చెందిన శిరీష అనే ఏడేళ్ల బాలిక కారు ఢీకొని మరణించింది. చిట్యాల గొత్తికోయగూడానికి చెందిన లక్ష్మయ్య అనే వ్యక్తి అడవిలో చెట్లను నరికివేసిన కేసులో పోలీసులు అరెస్టు చేస్తారని భయపడి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చింతగూడెం గ్రామానికి చెందిన గాదం రవీందర్ అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. గోవిందరావుపేట మండలంలో మద్దుల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కారు ఢీకొని మరణించాడు. తాడ్వాయి మండలంలో పోడును అడ్డుకున్నందుకు ఫారెస్టు అధికారులపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. జనగలంచ వద్ద లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో 34 మంది ప్రయాణికులు గాయపడ్డారు. జనగలంచ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏటూరునాగారం మండలానికి చెందిన అంగన్‌వాడీ టీచర్, ఆమె కొడుకు దుర్మరణం పాలయ్యారు. వెంకటాపూర్ మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దాపూర్ వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో విద్యార్థులు వెంకటేశ్వర్‌రావు, మణిదీప్ మృతిచెందారు. రామప్ప ఆలయ పరిసరాల్లోని గొల్లాలగుడిని గుప్తనిధుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈఘటనకు పాల్పడిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ములుగు సమీపంలోని గట్టమ్మ దేవాలయం మలుపు వద్ద లారీ ఢీకొన్న సంఘటనలో ఎలక్ట్రీషియన్ వనం రాజు మరణించాడు. దేవగిరిపట్నంలో ట్రాక్టర్ తిరగబడి తేజావత్ హాస్సేస్ మృతిచెందాడు. ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వాజేడు మండల కేంద్రానికి చెందిన సత్యనారాయణరాజు, ఆయన భార్య సత్యవతి, కూతురు అనిత, ఆటో డ్రైవర్ నాగరాజు దుర్మరణం చెందారు. తాడ్వాయి మండలం తక్కెళ్లగూడెం గొత్తికోయగూడెంలో మంగమ్మ అనే మహిళను అనుమానంతో భర్త గొంతునులిమి హత్య చేశాడు. జూలై 23న వాజేడు మండలం బొగత జలపాతంలో మునిగి జశ్వంత్ అనే యువకుడు మృతి చెందాడు. అక్టోబరు 31న వాజేడు మండలం కిష్టాపురంలో పిడుగుపాటుకు గురై యువకుడు మృతిచెందాడు. నవంబరు 1న ఏటూరునాగారం మండలం రామన్నగూడానికి చెందిన రైతు చెన్నూరి మల్లయ్య అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు.



తాడ్వాయి అడవిలో పులి పాద ముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు (ఫైల్)

వణికించిన పులుల సంచారం

ములుగు జిల్లాలోని అభయారణ్యం 800 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో కలిగి ఉంది. విభిన్న జంతుజాలానికి ఇది నిలయం. కొంతకాలంగా కనిపించని పులి ఈ ఏడాది సంచరించింది. సమీపంలోని పాకాల అడవుల నుంచి తప్పిపోయి వచ్చిన ఓ చిరుతపులి ములుగు మండలంలోని మదనపల్లి, రామచంద్రాపురం అడవుల్లో సంచరించింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన ఓ పెద్దపులి వెంకటాపురం, మంగపేట, తాడ్వాయి అడవుల్లో 15 రోజులపాటు సంచరించింది. దీంతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

పాత విద్యార్థులకు మళ్లీ పరీక్షలు!

- కేయూ ఇయర్ వైజ్ విద్యార్థులకు డిగ్రీ కల నెరవేర్చుకునే ప్రత్యేక అవకాశం
- 2016 కంటే ముందు వారికి నిర్వహణ



కేయూ క్యాంపస్ డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో పరిధిలో అప్పట్లెప్పుడో డిగ్రీ చదివారా.. మీరు డిగ్రీ చదివిన సందర్భంలో పరిస్థితులు అనుకూలించక ఫెయిల్ అయ్యారా? తర్వాత మళ్లీ పరీక్షలు రాసి పాసై డిగ్రీ సంపాదించుకుని ఉద్యోగం సాధించాలని పట్టుదలగా ఉన్నారా.. అయితే మీ కోసం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు మంచి అవకాశాన్ని కల్పించారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లోని డిగ్రీ కోర్సుల్లో ఇయర్ వైజ్ అభ్యర్థులకు డిగ్రీ కోర్సుల్లో తప్పిన సబ్జెక్టులకు ప్రత్యేక అనుమతులతో పరీక్షలు రాసే వెలుసుబాటును కల్పించారు. బీఏ, బీకామ్, బీఎస్సీతో పాటు ఇతర డిగ్రీ కోర్సుల్లోని సబ్జెక్టులతో పాటు ప్రాక్టీకల్స్, వైవా పరీక్షలకు సైతం ప్రత్యేక అనుమతి తీసుకుని తప్పిన సబ్జెక్టులకు మళ్లీ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించొచ్చు.

ఎవరెవరికి అవకాశం అంటే..

2016 సంవత్సరం కంటే ముందు ఇయర్ వైజ్ డిగ్రీ కోర్సులు చదివిన అభ్యర్థులందరికీ అవకాశం కల్పించారు. ఐతే వర్సిటీ ప్రత్యేక అనుమతి తీసుకుని పరీక్షలు రాయాలి. గతంలోనూ వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు 2020- 2021, 2021- 2022 ఏడాదిలో ఇలాంటి అభ్యర్థులకు అవకాశం కల్పించారు. అప్పుడు చాలా మంది అభ్యర్థులు ప్రత్యేక అనుమతితో పరీక్షలు రాసి డిగ్రీ కలను నేరవేర్చుకున్నారు. అయితే కొందరూ అనివార్య కార ణాలతో పరీక్షలు రాయలేక, రాసిన ఉత్తీర్ణత సాధించలేక మిగి లిపోయారు. వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు లెక్కల ప్రకారం 2016 కంటే ముందు ఇయర్ వైజ్ డిగ్రీ కోర్సుల్లో సుమారు 30 - 40 మంది డిగ్రీ కోర్సుల్లో కొన్ని సబ్జెక్టుల్లో తప్పి డిగ్రీ పట్టాను అందుకోలేకపోయినట్లు లెక్కలున్నాయి. వీరికి ప్పుడూ ప్రత్యేక అనుమతితో మళ్లీ పరీక్షలు నిర్వహిస్తే కష్టపడి చదువుకుని ఉత్తీర్ణత పొందే అవకాశం ఉంది. 2016 ఏడాది నుంచి యూజీసీ నియమ నిబంధనల మేరకు డిగ్రీ కోర్సుల్లో దేశ వ్యాప్తంగా సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టారు. సెమిస్టర్ విధానంలో విద్యార్థులకు డిగ్రీ సప్లమెంటరీ పరీక్షలకు హాజ రయ్యే అవకాశం ఉంది. అయితే డిగ్రీ ఇయర్‌వైజ్ విద్యార్థులకు ఇప్పుడున్న సెమిస్టర్ విధానంతో ఇబ్బందుల్లో పడ్డారు. ఆ ఇబ్బం దులను తొలగించి వారి డిగ్రీ పట్టా కలను నేరవేర్చేందుకు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు.

అనుమతి కోసం దరఖాస్తులు ఎలా చేయాలి?

డిగ్రీ ఇయర్‌వైజ్ విద్యార్థులందరూ మొద టగా వర్సిటీ క్యాంపస్ పరిపాలన భవనం లోని అకాడమిక్ బ్రాంచ్‌లో సంప్రదించాలి. వారు ఏ ఏడాది ఏ సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారో.. వర్సిటీ అధికారులకు తెలియజేస్తూ దరఖాస్తులు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు వారి డిగ్రీ మెమోను జత చేయాలి.

వర్సిటీ అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తారు. దీనికి గాను వర్సిటీకి ఒక్కో పేపర్‌కు రూ. 3 వేల చొప్పున ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించాలి. ప్రాసెసింగ్ ఫీజుతో పాటు అదనంగా మళ్లీ పరీక్షల ఫీజు ఒక్కో పేపర్‌కు రూ. 4 వేలు అభ్యర్థులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే దివ్యాంగ విద్యార్థులకు అకాడమిక్ బ్రాంచ్‌లో చెల్లించాల్సిన ఫీజులు ఉండవు. పరీక్షల ఫీజు మాత్రం ఒక్కో సబ్జెక్టుకు రూ. 500లు చెల్లించాలి. ఫీజులు చెల్లించుకున్న అభ్యర్థులందరికీ వర్సిటీ రిజిస్ట్రార్ అర్డర్ మేరకు వారు చదివిన కళాశాలల్లో పరీక్షల ఫీజులు చెల్లించుకునే అవకాశం ఉంది.

ఫీజులు కళాశాలల్లోనే చెల్లించుకోవాలి

వర్సిటీ అకాడమిక్ బ్రాంచ్‌లో దరఖాస్తులు చేసుకున్న తర్వాత రిజిస్ట్రార్ పేరుతో అభ్యర్థులకు అర్డర్‌ను వెలువరిస్తారు. ఆయా అర్డర్ మేరకు విద్యార్థులు వారు చదివిన కళాశాలల్లో ఒక్కో పేపర్‌కు పరీక్షలు ఫీజులు చెల్లించుకోవాలి.

అభ్యర్థులకు సిలబస్‌ను ముందే చెబుతారు..

ప్రత్యేక అనుమతితో ఇయర్ వైజ్ స్కీంలో దరఖాస్తులు చేసుకుని పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులందరికీ వారి సబ్జెక్టు వైజ్‌గా ముందుగానే ఆయా పరీక్షల సెలబస్‌ను వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు చెబుతారు.

ఉదాహరణకు 2001-2023 ఏడాదిలో డిగ్రీ చదివిన అభ్యర్థులకు వారు చదివిన ఏడాదిలో వర్సిటీలో అమల్లో ఉన్న సెలబస్‌తోనే పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తారు. అయితే కొన్ని సబ్జెక్టులు అవుట్ డేడ్ అవుతాయి. అవుట్ డేడ్ అయిన సబ్జెక్టులకు వర్సిటీలోని అయా విభాగాల పాఠ్య ప్రణాళిక విభాగం వారిచ్చే సరిసమానమైన సబ్జెక్టు పేపర్‌లో పరీక్షలకు అనుమతిస్తారు. సిలబస్ దాదాపుగా సరిపోయే విధంగా విద్యార్థులకు న్యాయంగా ఉండేది నిర్ణయిస్తారు. పరీక్షల ఫీజులు చెల్లించే సమయంలోనే ఆయా సబ్జెక్టుల వివరాలను అభ్యర్థులకు స్పష్టంగా వర్సిటీ ఉన్నతాధికారులు చెబుతారు.

ఫీజుల షెడ్యూల్ ఇలా

2025 జనవరి 31 వరకు వర్సిటీ అకాడమిక్ బ్రాంచ్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజిస్ట్రార్‌కు ప్రత్యేక అనుమతి కోసం దరఖాస్తులు సమర్పిం చుకోవాలి. తర్వాత 2025 ఫిబ్రవరి 1 వరకు సంబంధిత కళాశాలలో పరీక్షల ఫీజులు చెల్లించుకోవాలి. అప్పట్లో అభ్యర్థులు చదివిన కళాశా లలు అనివార్య కారణాలతో ఇప్పుడు మూసి వేస్తే ఆయా కళాశాలల అభ్యర్థులు నేరుగా వర్సిటీలోనే పరీక్షల ఫీజులు చెల్లించుకుని పరీక్షలకు హాజరైయ్యే అవకాశం ఉంది.

వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్‌లో పరీక్షా కేంద్రాలు

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇయర్‌వైజ్ స్కీంలో పరీక్షలకు హాజరైయ్యే అభ్యర్థులకు పరీక్షలు నిర్వ హిస్తారు. అన్ని సబ్జెక్టులకు ప్రత్యేకంగా పరీక్షల టైం టేబుల్‌ను ప్రకటిస్తారు. పరీక్షలు ఫీజుల షెడ్యుల్ గడువు ముగిసిన తర్వాత పరీక్షల ప్రాసెస్‌ను కొనసాగించి పరీక్షలు టైం టేబుల్ షెడ్యుల్‌ను వెల్లడించారు.

పాత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

వర్సిటీ పరిధిలోని ఇయర్‌వైజ్ స్కీంను పాత విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలి. మూడేళ్ళు ఎంతో కష్టపడి రెగ్యులర్‌గా డిగ్రీ కోర్సులు అభ్యసించి అఖరుగా అప్పట్లో పరీక్షలు రాసే సమయంలో అనివార్య కారణాలతో విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేకపోవచ్చు. అలాగే ఇతర కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతోనూ పరీక్షలు తప్పవచ్చు. కొందరూ విద్యార్థులకు ఆరోగ్యం సహకరించకపోవచ్చు. అన్ని పరీక్షల సబ్జెక్టులు ఉత్తీర్ణత సాధించి ప్రాక్టీకల్స్, వైవా పరీక్షల్లోనూ ఫెయిల్ కావచ్చు. వారందరూ ఇప్పుడూ మళ్ళీ పరీక్షలు రాయేచ్చు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డిల ఇతర అధికారుల అనుమతితో పరీక్షలు నిర్వహిస్తున్నాం. పాత విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ప్రొఫెసర్ కట్ల రాజేందర్, పరీక్షల నియంత్రణాధికారి, కేయూ

బొంగులో కల్లు.. భలే..





బొంగులో చికెన్, బిర్యానీలను చూశాం. తాజాగా 'బొంగులో కల్లు'ను కూడా విక్రయిస్తున్నారు. తాటిచెట్లకు లొట్ల స్థానంలో వెదురుబొంగులు కట్టి.. వచ్చిన కల్లును విక్రయిస్తున్నారు. సాధారణకల్లు కంటే ఈ బొంగులో కల్లు రుచిగా కూడా ఉంటోందని కల్లు ప్రియులు చెబుతున్నారు. ఇక ఈ కల్లుకు గిరాకీ ఉంటుండంతో గీతవృత్తి దారులు కూడా బొంగులో కల్లునే విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం ప్రాజెక్టునగర్ సమీపంలోని తాటిచెట్లకు ఇదిలో ఇలా లొట్టిస్థానంలో బొంగులను కట్టారు.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి', భూపాలపల్లి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఏటూరునాగారంలో సెంట్రల్ లైటింగ్

రూ. 75లక్షలతో పనులు ప్రారంభం

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అభివృద్ధి పట్టాలెక్కుతోంది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పనులకు మోక్షం కలుగుతోంది. డివిజన్ కేంద్రంగా ఏర్పాటవుతున్న క్రమంలో ఏటూరునాగారం దినదినాభివృద్ధి చెందుతోంది. ముఖ్యంగా ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని చేపల మార్కెట్ నుంచి వై-జంక్షన్ వరకు ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రూ. 7 కోట్లతో ప్రధాన రహదారి విస్తరణ పనులు గతంలోనే పూర్తయింది. రోడ్డు విస్తరణ పనులు చేపట్టినపుడే సెంట్రల్ లైటింగ్ పనులు జరగాల్సి ఉండగా నిధుల కొరతతో నిలిచిపోయాయి. అప్పటి నుంచి పెండింగ్ ఉన్న పనులకు మోక్షం కలిగింది.

రూ. 75 లక్షల వ్యయంతో..

రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క ప్రత్యేక చొరవతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. సీఆర్ఆర్ నిధుల నుంచి రూ. 75 లక్షలు కేటాయించగా ఈ ఏడాది ఆగస్టు 30న ఆ పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో నాలుగు నెలల తర్వాత పనులు ప్రారంభమయ్యాయి. చేపల మార్కెట్ నుంచి వై జంక్షన్‌వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. సెంట్రల్ లైటింగ్ పనులను రెండు నెలలలోపు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పనులు ప్రారంభం కావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రహదారికి కొత్త కళ

సుమారుగా మూడు కిలోమీటర్ల మేరు ఉన్న రహదారిపై సెంట్రల్ లైటింగ్ పనులు అందుబాటులోకి వస్తే ఎంతో మండల ప్రజలకు ఎంతో ప్రయోజకరంగా ఉంటుంది. రోడ్డు విస్తరణ అనంతరం ప్రధాన రహదారిపై సరియైన లైటింగ్ సిస్టం లేక ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. లైటింగ్ సిస్టం సరిగా లేక రహదారిపై తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రహదారిపై సెంట్రల్ లైటింగ్ పనులు అందుబాటులోకి వస్తే రహదారికి కొత్త కళతో పాటు ప్రమాదాలకు కూడా చెక్ పడే అవకాశముందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సెంట్రల్ లైటింగ్ ఏర్పాటవుతున్న వైజంక్షన్

మన్మోహన్ సింగ్‌కు నివాళి

మహదేవపూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గొప్ప రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహదేవపూర్‌లో మన్మోహన్‌సింగ్‌కు శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయ్‌కుమారల్ మాట్లాడారు. భారతదేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించిన రాజనీతిజ్ఞుడని తెలిపారు. 1972-1976 సంవత్సరంలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో ఆర్థిక సలహాదారులుగా పనిచేశారని తెలిపారు. 2004 నుంచి 2014 వరకు భారతదేశ ప్రధాన మంత్రిగా తమ సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాస్, ఈ మాధవి, శాఖమూరి రవీందర్, వంగపల్లి పరశురాములు, కె.మున్నయ్య, జి.రమేష్, సీహెచ్.రాజేందర్, సల్ల రమ్య, ఎం.శ్రీధర్, బి.వెంకటయ్య, శివకృష్ణ, భాగ్యలక్ష్మి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మన్మోహన్‌సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

- కాకతీయఖని (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఐఎన్‌టీయూసీ నాయకులు శనివారం నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూల మాలవేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. భూపాలపల్లి పట్టణంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మధూకర్‌రెడ్డి, కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ ఇన్‌చార్జీ నాగేంద్రబాబు, నాయకులు సతీష్, కుమారస్వామి, అశోక్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి

మంగపేట, డిసెంబరు 28: (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు హేమాచల కొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామిని శనివారం భక్తులు వందలాదిగా తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులు ముందుగా చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించి జలాంజనేయస్వామిని, పంచముఖాంజనేయస్వామిని, శ్రీ వేణుగోపాలస్వామిని, రమ సత్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. భక్తులు కొండపై కొలువైన ఉన్న స్వయంభు పుట్టుస్వామిగా విరాజిల్లుతున్న లక్ష్మీనర్సింహస్వామిని, ప్రక్కనే కొలువు ఉన్న అమ్మవార్లయిన ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మి అమ్మవార్లను, శ్రీ స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు కైంకైర్యం రాఘవాచార్యులు, ముక్కమళ్ల రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పవన్‌కుమారాచార్యులు, ఈశ్వర్‌చంధవర్మ, వెంకటనారాయణశర్మ, అనిపెద్ది మురళీకృష్ణశర్మ భక్తులకు దైవ దర్శనాలు గావించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. అనంతరం అన్నదానాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు సుమారు 10 వేల మందికి పైగా భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారని ఆలయ ఈ.వో శ్రవణం సత్యనారాయణ, అర్చక, ఉద్యోగులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఉద్యోగులు, పాలక మండలి డైరెక్టర్లు పాల్గొన్నారు.



హేమాచల ఆలయంలో భక్తులు

ద్విచక్ర వాహనం అదుపుతప్పి గాయాలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని సోమవారం చోటు చేసుకుంది. భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్దారం గ్రామానికి చెందిన రవి తన ద్విచక్ర వాహనంపై భూపాలపల్లికి వస్తుండగా మార్గం మధ్యలో ఈ ఘటన జరిగింది. భూపాలపల్లి ప్రధాన రహదారి అధిక లోడుతో వెళ్లే వాహనాలతో పూర్తిగా గుంతలమయమై ఉండటం వల్ల ఆ గుంతల్లో ద్విచక్ర వాహనం పడి అదుపుతప్పి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. మొహం భాగాన గాయాలు కావడంతో స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రి తరలించారు.

పని ప్రదేశాల్లో పర్యటించిన కమిటీ

కాకతీయఖని, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని బొగ్గు గనుల పని ప్రదేశాల్లో ఫీమేల్ ఫెసిలిటీస్ కమిటీ శనివారం పర్యటించింది. ఈ సందర్భంగా మహిళా కార్మికులకు గనుల వద్ద కల్పించాల్సిన టాయిలెట్స్, రెస్ట్ షెల్టర్స్ తదితర సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా.. లేవా? అని పరిశీలించారు. ప్రస్తుతం సింగరేణిలో మహిళా కార్మికుల సంఖ్య పెరుగుతుండటంతో వారికి పర్మినెంట్ టాయిలెట్స్, రెస్ట్ షెల్టర్స్ తదితర వసతులను ఏర్పాటు చేసేలా ఏరియా సింగరేణి జీఎంకు కమిటీ సభ్యులు నివేదిక సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ పద్మజ, కావూరి మారుతి, భానుప్రసాద్, శ్రీనివాస్, జాకీర్ హుస్సేన్, సాయికృష్ణ, సందీప్‌కుమార్, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో కిరణ్మయికి చోటు



కాటారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలిగా కాటారం గ్రామానికి చెందిన గంట కిరణ్మయి ఎన్నికయ్యారు. సిద్దిపేటలో ఇటీవల జరిగిన 43వ రాష్ట్ర మహాసభల్లో ఏబీవీపీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా అం దులో కిరణ్మయి శాతావాహన యూనివర్సిటి నుంచి రాష్ట్ర నిర్వహణ కమిటీ సభ్యురాలిగా ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి ప్రకటించారు. కిరణ్మయి గతంలో భూపాలపల్లి నగర కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలుగా పని చేశారు. కిరణ్మయి తండ్రి అంకయ్య బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

గుడుంబా పట్టివేత

రేగొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొనగండ్ల, రేపాక గ్రామాల్లో శనివారం పోలీసులు దాడులు చేశారు. ఈ సందర్భంగా 13 లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. గుడుంబాను విక్రయిస్తున్న ఉల్లి రమ, శివరాత్రి ఓదెలుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కాళేశ్వరం అర్చకుడికి అవార్డు

మహదేవపూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రముఖ దేవస్థానం ముక్తీశ్వర కాళేశ్వరాలయం ఉప ప్రధాన అర్చకుడు పనకంటి ఫణీంద్ర శర్మకు హైదరాబాద్‌లోని మనం ఫౌండేషన్ అవార్డును ప్రదానం చేసింది. కొత్త సంవత్సరం వేడుకల్లో భాగంగా శనివారం జరిగిన ఈ కర్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి చేతుల మీదుగా ఫణీంద్రశర్మ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న ఫణీంద్ర శర్మ

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

రేగొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు. శనివారం రూపిరెడ్డిపల్లి గ్రామ శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పరకాల వైపు ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టరున పట్టుకున్నామని, యజమాని వంశీకుమార్‌పై కేసు నమోదు చేశామని వివరించారు.

సీఎం కప్ రాష్ట్ర పోటీలకు విద్యార్థి ఎంపిక

మల్హర్, డిసెంబరు 28 : తాడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న లావుడియా ఆశ్రిత్ చౌహాన్ సీఎం కప్ రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడు. భూపాలపల్లిలో జిల్లా స్థాయిలో నిర్వహిం చిన షటిల్ టోర్నమెంట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచాడు. దీంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి తెలిపారు. శుక్ర, శనివారాల్లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్‌లో ఆడినట్లు ఆయన తెలిపారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

కాటారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మధుసూదన్ శనివారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో మందుల నిల్వలు, రోగులకు అందుతున్న వైద్యసేవలను ఆరా తీశారు. ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం గురించి వైద్యులకు వివరించారు. ప్రభుత్వ వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వెద్యాధికారి డాక్టర్ మౌనిక, డాక్టర్ హారిక, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ గీత, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ చిరంజీవి, డీడీఎం మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్ షాపుల వివాదం

ఖాళీ చేయించేందుకు సిద్ధమైన అధికారులు

వెంకటాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లో షాపుల కాలపరిమితి పూర్తయింది. ఆర్టీసీ అధికారులు టెండర్లు పిలిచినా యజమానులెవరూ టెండర్లకు వెళ్లకుండా షాపులను ఖాళీ చేయకుండా వివాదం చేశారు. శనివారం షాపులను ఖాళీ చేయించేందుకు ఆర్టీసీ అధికారులు భద్రాచలం డీఎం తిరుపతి ఆధ్వర్యంలో బస్టాండ్‌కు చేరుకున్నారు. కాంప్లెక్స్‌లో ఉన్న పదిషాపులకు గత సంవత్సరం నుంచి టెండర్లు పిలిచినా యజమానులెవరూ టెండర్లకు హాజరుకాకుండా అద్దె చెల్లించకుండా వ్యవహరించారు. దీంతో అధికారులు షాపులను ఖాళీ చేయాలని, లేనిపక్షంలో కూల్చి వేస్తామని హెచ్చరించారు. అయినప్పటికీ యజమానులు వినకపోవడంతో అధికారులు జేసీబీ సహాయంతో షాపులను కూల్చేందుకు సిద్ధమయ్యారు. దీంతో షాపుల యజమానులు, గ్రామపెద్దలు అధికారులతో మాట్లాడి కొంత సమయం కావాలని కోరడంతో వారు కూల్చివేతను నిలిపివేశారు.

పదిషాపుల్లో ఐదు షాపు లకు టెండర్లు పూర్తయ్యాయని, మరో ఐదు షాపులకు టెండర్లు పిలుస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం పవిత్ర, అసిస్టెంట్ మేనేజర్ గౌతమి, విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

కాస్తు భూములపై రైతుబంధు అందించాలి : సీపీఎం

గోవిందరావుపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో కాస్తు కబ్జాలో ఉన్న రైతులకు పట్టాలు ఇచ్చి రైతు బంధు అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రైతుసంఘం జిల్లా నాయకుడు తుమ్మల వెంకట రెడ్డి మాట్లాడుతూ మండలంలో వందలాదిమంది రైతులకు పట్టాలు లేక ప్రభుత్వ పథకాలు వర్తించక, బ్యాంకు రుణాలు రాక ఇబ్బందిపడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వం ధరణి పేరుతో కాస్తుకాలం తీసేయడం వల్ల అనేకమంది రైతులు అయోమయంలో పడ్డారని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు న్యాయం చేస్తామని, పోడుభూములకు పట్టాలందిస్తామని వాగ్దానం చేసిందని, ఇచ్చిన వాగ్దానం మేరకు మండలంలో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించి కాస్తుకాలంలో ఉన్న ప్రతి రైతుకు పట్టాలందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టంలో అర్హులైన పేదరైతులకు, పోడు, కౌలు రైతులకు న్యాయం చేయాలన్నారు. లేనట్లయితే పెద్దఎత్తున రైతులను సమీకరించి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సృజన్‌కుమార్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గుండు రామస్వామి, రామచంద్రారెడ్డి, నాయకులు సోమ మల్లారెడ్డి, పొదిళ్ల చిట్టిబాబు, కన్నేజు సదానందం, మహేందర్, సారయ్య, కడారి నాగరాజు, గుండు లెనిన్, పల్లపు రాజు, ఉపేంద్రచారితోపాటు పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

గుట్టలుగా చెత్తాచెదారం

కాటారం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులో 353(సీ)జాతీయ రహదారికి అతి సమీపంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా స్టేజ్-2 పంప్ హౌస్ నుంచి నీటి లిఫ్ట్ కోసం నిర్మించిన గారెపల్లి రిజర్వాయర్ పియానో వియర్ (మత్తడి) ముందు భారీగా చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా ఉంటున్నాయి. వీటన్నింటినీ చూస్తే జీపీ ఆధ్వర్యంలో అధికారికంగా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులాగా ఉందని పలువురు అంటున్నారు. అధికారిక డంపింగ్ యార్డు ఉన్నప్పటికీ దారి సరిగా లేక చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ల ద్వారా తెచ్చి రిజర్వాయర్ ముందు ఉన్న ప్రదేశంలో పారవేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొందరు వ్యాపారులు, ప్రజలు ప్లాస్టిక్ వ్యర్థాలను తెచ్చి పారేయడం, కాలబెట్టడం చేస్తున్నారు. దీంతో అటువైపు నుంచి వెళ్లే వారికి దుర్వాసన రావడం, ఆహార పదార్థాల వ్యర్థాలు పారేయడంతో వందలాదిగా కోతులు వచ్చి పంటలను పాడు చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



గుట్టగా పోసిన చెత్తాచెదారం

ఉద్యోగులకు నివాళులర్పించిన ఐటీడీఏ పీవో



మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న అనారోగ్యంతో మృతి చెందిన ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ భీంరావు, ట్రైబల్ వెల్ఫేర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో సబార్డినేట్ శ్రీలక్ష్మి మృతి చెందగా ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా సంతాపం నివాళులర్పించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో మృతుల చిత్రాపటాలకు శనివారం పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీడీ పోచం, ఎస్‌డీసీ వెంకటేశ్, ఎస్‌వో సురేష్‌బాబు, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి పోరాడాలి: సీపీఎం

వెంకటాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొంతకాలంగా కాంట్రాక్టర్ బీటీ రోడ్డు పనులను పూర్తి చేయకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, రోడ్డు నిర్మాణం కోసం దశలవారీగా ఆందోళనలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ అన్నారు. మండలంలోని కొండాపురంలో ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరగగా ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల కోసం, ప్రజల కోసం అనునిత్యం పోరాడే పార్టీ సీపీఎం అని అన్నారు. అనంతరం పార్టీలో చేరిన 20 మందికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి గ్యానం వాసు, నాయకులు కట్ల నర్సింహచారి, చిట్టెం ఆదినారాయణ, పర్శిక సతీష్, శ్రీనివాసరావు, సమ్మయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ పనులు పరిశీలించిన ఎస్ఈ

వాజేడు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపు రం-చెరుకూరు వరకు జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను ఎన్‌హెచ్ ఎస్ఈ మోహన్ శనివారం పరిశీలించారు. నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులు మండలంలో 11 కిలోమీటర్ల మేర ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు, అడ్డుగా ఉన్న ఇళ్లను కాంట్రాక్టరు తొలగించారు. ఈ క్రమంలో ఆయన జగన్నాథపురం నుంచి చెరుకూరు వరకు జరుగుతున్న పనులను పరిశీలించారు. ఎస్ఈ మోహన్‌కు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్ వర్మ ఆధ్వర్యంలో పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. ఇసుకవాగు వంతెనపై నూతన వారధి నిర్మాణంతో పాటు దూలాపురం, చీకుపల్లి, గుమ్మడిదొడ్డి, పెద్దగొల్లగుడెంలో గోదావరి వరదల సమయంలో రహదారులు మునుగుతున్న క్రమంలో విస్తరణ పనులలో రహదారి ఎత్తును పెంచాలని కోరారు. ఇల్లు కోల్పోతున్న పేదలకు నష్ట పరిహారం ఇచ్చే విధంగా చూడాలని విన్నవించారు. ఆయన వెంట ఈఈ మనోహర్, నాయకులు విశ్వనాథ ప్రసాదబాబు రాజు, తల్లడి ఆదినారాయణ, జగన్నాథరాజు, ఖాజావలీ తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ టీచర్లను క్రమబద్ధీకరించాలి : టీపీటీఎఫ్

ఏటూరునాగారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్ర మ పాఠశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యా యుల సర్వీసులను ప్రభుత్వం క్రమబద్ధీకరించి కనీస వేతనం చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రె స్సివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీ టీఎఫ్) ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట సీఆర్‌టీలు చేస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్‌టీలు చేస్తున్న నిరవధిక సమ్మెకు టీపీటీఎఫ్ సంపూర్ణ మద్దత్తు తెలుపుతుందని తెలిపారు. గిరిజన విద్యాభివృధికి కృషి చేస్తున్న సీఆర్‌టీలకు ప్రభుత్వం నుంచి కనీస వేతనం అమలు కాకపోవడం వలన శ్రమ దోపిడీకి, మనోవేదనకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బి. రాజు, కార్యవర్గ సభ్యులు కె. సతీష్, సుమారు 30 మంది సీఆర్‌టీలు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

వెంకటాపూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో విద్యనభ్యసిస్తున్న పదోతరగతి విద్యార్థులకు వెంకటాపూర్ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, ఇంటెలిజెన్స్ ఎస్పీ దండగుడి రమేష్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతో విద్యను అభ్యసించినట్లయితే ఉన్నతస్థాయికి ఎదుగుతారని అన్నారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం ట్రిపుల్ ఐటీ బాసరలో సీట్లు సాధించిన బుస అక్షిత, కొట్టె శివకుమార్, పూర్ణ, ఆనంద్‌కు ఆయన గోల్డ్‌మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధిక, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జరీనాబేగం, స్థానిక ఎస్సై జక్కుల సతీష్, ఉపాధ్యాయులు జనగాం బాబూరావు, అంబేద్కర్, మహేష్, సంధ్య, కిషోర్, జగన్మోహన్, జగన్నాథం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం.. రక్షించిన పోలీసులు

ఏటూరునాగారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అత్తవారింటి వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను శనివారం రాత్రి పోలీసులు రక్షించారు. ఎస్సై తాజుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా మద్దెడు గ్రామానికి చెందిన ఇంద్రారపు సమ్మక్కకు ఏటూరునాగారం మండల కేంద్రంలోని బెస్తవాడకు చెందిన తిరుమలరావుతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. రెండేళ్ల క్రితం క్యాన్సర్‌తో బాధపడుతూ సమ్మక్క భర్త తిరుమలరావు మృతి చెందాడు. భర్త మరణం తర్వాత సమ్మక్క తల్లిగారింటికి మద్దెడుకు వెళ్లి మళ్లీ తిరిగి ఏటూరునాగారంలోని అత్తవారింటి వచ్చింది. ఆస్తి పంపకాల వివాదాల కారణంగా అత్తవారి నుంచి వేధింపులు ఎదుర్కొంటూ మనస్తాపం చెందింది. ఈ క్రమంలో సమ్మక్క మండలంలోని ముల్లెకట్ట వంతెపైకి వెళ్లి ఆత్మహత్యకు యత్నించగా స్థానికులు వెంటనే ఎస్సై తాజుద్దీన్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన సంఘటన స్థలానికి చెరుకొని ఆమెను రక్షించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమ్మక్క అత్తమామలను పోలీస్‌స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ముమ్మరంగా సోదాలు

మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డు, వై-జంక్షన్, ఆకులవారిఘణపురంతో ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. సీఫర్ డాగ్‌తో సోదాలు చేశారు. అనంతరం పోలీస్ సిబ్బందితో కలిసి ఎస్సై కిరాణం షాపులను తనిఖీ చేశారు. ఏజెన్సీ ప్రాంతాన్ని డ్రగ్స్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, గ్రామీణ ప్రాంత యువత మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

వెంకటాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కిరాణాషాపులు, దుకాణాల్లో శనివారం స్థానిక సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతిరావుల ఆధ్వర్యంలో డాగ్‌స్క్వాడ్ బృందాలు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాయి. అదేవిధంగా మండలకేంద్రానికి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని పూర్తి సమాచారాన్ని సేకరించి వదిలేశారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ స్థలంలోనే భవనాన్ని నిర్మించాలి

మేడారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణం గ్రామ పంచాయతీ నర్సరీకి చెందిన స్థలంలో మేడారం ప్రధాన రహదారి వెంట నిర్మించాలని శనివారం జరిగిన గ్రామ సభలో గ్రామస్థులు తీర్మానించారు. తహసీల్దార్ గిరిబాబు స్థలం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల కోరిక మేరకు భూమి స్థితిగతులను పర్యవేక్షించి ఉత్తర్వులు జారీ చేస్తామని ఆయన అన్నారు. గ్రామంలో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయని గ్రామస్థులు తెలపడంతో కబ్జాకు గురైన ప్రభుత్వ నిర్మాణ స్థలాలను పరిశీలించారు. అంతేకాకుండా గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు, అతిథి భవనాల నిర్మాణాల కోసం స్థలం కావలని కబ్జా అయిన భూములను గుర్తించి పంచాయతీకి అప్పగించాలని వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ధర్మేందర్, అటవీ శాఖ బీట్ ఆఫీసర్ వసంత్ తదితరులు పాల్గొన్నారు

దందాలకు అడ్డు ఏదీ?

(5వ పేజీ తరువాయి)

లారీలతో పాటు ఇతరపత్రా ప్రైవేటు వాహనాల వేగాన్ని తగ్గించడంలో అధికారులు పెద్దగా దృష్టి సారించలేదు. మరోవైపు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ కూడా సరిగ్గా పని చేయలేదు. మూడు నెలలకోమారు రిపేరు వచ్చి అడపాదడపాగా పని చేశాయి.

రెచ్చిపోయిన దొంగలు

గడిచిన ఈ ఏడాది దొంగలు బీభత్సం సృష్టించారు. జిల్లా వ్యాప్తంగా చాలాచోట్ల దొంగతనాలు పెరిగిపోయాయి. రోజుల వ్యవధిలోనే దొంగతనాలు జరిగిన ఘటనలు సైతం చోటు చేసుకున్నాయి. దొంగలను పసిగట్టడంలో పోయిన వస్తువులను రికవరీ చేయడంలో పోలీసులు విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. గతేడాది 69 దొంగతనాలు జరిగాయి. దొంగలించిన మొత్తం సొత్తు రూ. 45,22,726 కాగా రూ. 15,72,830 రికవరీ చేశారు. ఈ ఏడాది ఏకంగా 108 దొంగతనాలు జరగ్గా 24,85,400 రికవరీ చేశారు.

ఖాకీ చొక్కాలకు మాయని మచ్చలు

ప్రజల రక్షణకు పాటు పడాల్సిన పలువురు పోలీసు అధికారుల తీరు సర్వత్రా వివాదస్పదమైంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు ఎస్పీ, మహిళను వేధించిన కేసులు ఎస్సై, పోక్సో చట్టం కింద ఓ సీఐపై కేసులు నమోదవడం సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. వీటితో పాటు మహదేవపూర్ ఠాణాలో కాంగ్రెస్ నేత డాన్సులు, ఇదే ఠాణాలోని ఏడుగురు సిబ్బందిపై వేటు, మొగుళ్లపల్లి ఠాణాలో ఓ రాజకీయ నాయకుడి బర్త్ డే వేడుకలు, ఇతరత్రా ఘటనలు పోలీస్ శాఖకు మచ్చను తెచ్చిపెట్టాయి. మరోవైపు నేరాల నియంత్రణకు ఎంతో దోహదం చేసే సీసీ కెమెరాల ఏర్పాటులో కొంత మంది పోలీసు అధికారులు చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

శాంతిభద్రతలపై ఎస్పీ కిరణ్‌ఖరే నజర్

శాంతిభద్రతల పరిరక్షణపై ఎస్పీ కిరణ్‌ఖరే ప్రత్యేక మార్కున సొంతం చేసుకున్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన వీవీఐపీలు, వీఐపీలకు భద్రతా పరంగా గట్టి బందోబస్తు చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సజావుకు ప్రత్యేకంగా కృషి చేశారు. వీటితో పాటు జిల్లాలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావులు పర్యటించగా బందోబస్తు పరంగా గట్టి చర్యలు చేపట్టారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ ఇక్కడి లాఅండ్‌ఆర్డర్ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్పీ కిరణ్‌ఖరేను ప్రత్యేకంగా అభినందించారు.

ఈ ఏడాది జరిగిన పలు నేరాలు, ఘోరాలు ఇలా..

భూపాలపల్లి జిల్లాలో 2024లో పోలీసుశాఖ వివిధ రకాలు కేసులు నమోదయ్యాయి. హత్యలు 11, ఆత్మహత్యలు 163, దొంగతనాలు 108 జరగ్గా రూ. 24,85,400 సొత్తును రికవరీ చేశారు. ఇక గంజాయి రవాణాలో 23కేసులు నమోదు కాగా 184.66 కేజీల గంజాయిని పట్టుకున్నారు. వాటి విలువ రూ.45,98,900 ఉంది. 78 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గుడుంబా 345 కేసుల్లో 354 మంది నిందితులను అరెస్టు చేసి 3812 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గత ఏడాది కొత్తగా ముగ్గురిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తే ఈ ఏడాది 9 మందిపై రౌడీషీట్‌ను తెరిచారు. ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు 178 జరగ్గా 79 మంది మృతి చెందారు. 239 మంది గాయపడ్డారు. పేకాట శిబిరాలపై దాడుల నేపథ్యంలో 36 కేసుల్లో 239 మంది అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4,15,720 సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 136 ఇసుక అక్రమ రవాణా కేసులు, 38 పీడీఎస్ బియ్యం రవాణా కేసులు నమోదు చేశారు. ఇలా ఏడాది కాలంలో పోలీసులు కట్టడికి చర్యలు చేపట్టినా అసాంఘిక కార్యకలాపాలు మాత్రం ఆగలేదు.